# యక్షగానం

ఏం చెయ్యను చెప్పు? దేవుడు న న్నల్లా పుట్టించాడు. అందమైన పిల్ల కనబడితే మీరు చూసి సంతోషించి ఊరు కుంటారు. కనుచూపు మేర దాటిపోగానే, ఆ సంగతే మరచి పోయి, మళ్ళా మామూలుగా ఉండగల తాహతు మీ కుంది. తామరాకుమీద నీటిబిందువులాగా, ఏదీ అంట కుండా తిరగగలరు. ఈ మిత్రుడికి అది చేతకాదు.

చూసి ఊరుకోలేను. అంత త్వరగా మనసుతిప్పేసు కోలేను. నాకు ఓపట్టున అసలు మనసుకెక్కదు. కాని చక్కని అమ్మాయి, ఎవరైనా నాకు నచ్చిందో, ఇక తాళు కోలేను. మనసుయిచ్చివేయాలిసిందే. ఏమరుపాటునైనా ఒక్కచిరునవ్వు విసిరితే, ఏనుగు నెక్కవలసిందే. దక్క కుండా పోయిన తరువాత, అదేపనిగా, తలచుకు తలచుకు చిక్కి శల్యమైపోవాలిసిందే - ఆ దెబ్బ తట్టుకుని, కొంచెం కోలుకుంటూండగా ఇంకోతవాయి వచ్చిందో - వ్యవహారం మళ్ళా మొదటికి రావాలిసిందే - కాని, ఏం చెయ్యను. ఎప్పుడూ ఓడు చెయ్యే అయినా మోజుమాత్రం పోవడం లేదు.

మొన్న సెలవులియ్యగానే రాముడి పెళ్ళికని గంగల కుర్రు మనవాళ్ళందరమూ కలిసిపోయినామూ? నీవు, పరి

షత్సభలకని, గుంటూరుకున్నావు. అక్కడా మామూలు అవాంతరమే వచ్చింది. ఒక్క తమాషా ఉందోయ్ మళ్ళా. పదహారేళ్ళు దాటిన పిల్లలందరూ కొంచెం కనుముక్కుతీరు అమరికగా ఉన్నవాళ్ళందరూ సర్వసాధారణంగా నా కంటికి అప్సరసలులాగా కనబడుతారు. కాని, చుక్కల్లో రోహిణిలాగా వాళ్ళందరిలోకీ ఎవరో ఓ అమ్మాయి నాకు ఒళ్ళు పరవశమైపోయేటంత వయ్యారంతో, కులుకుతూ ఎదటబడుతుంది. అంతటితో అయ్యగారు నీళ్ళుకారి పోతాడు.

బళ్ళుదిగి గుమ్మంలో కాలుపెట్టడం వ్యవధానంగా మన్మధజ్వరం ముంచుకువచ్చిందని మనసుబ్బులు, అసాధ్యుడు కనిపెట్టాడు. ఎవరో చూపించేదాకా, వదలలేదు. చూడగా వాడికి నోరూరినట్టుందోయ్ - తలఊచి మెచ్చుకున్నాడు. మంచిరకాన్నే ఏరుకున్నావన్నాడు. ఏలాగైనా, కవివికదా అన్నాడు. వాడి హుషార్ మాటలు వింటున్నకొద్దీ ఇక్కడ, మన ఆకాశసౌధంమీద అంతస్థులుపెరిగి పోతున్నాయ్—

నా గొడవేదో నేనుపడకుండా సక్రమంగా జరిగి పోయేదానికి అడ్డుపేచీకొట్టాడు. "ఒరే భాయీ, మనం వచ్చింది పరాయిచోటు. స్నేహితుడిపెళ్ళికి. ఆ పిల్ల ఎవరో ఎరగకుండానే చూపులు పారేయడం, కర్మంజాలక, మన వాడెవడి భార్యాఅయినా అయితే, అది మిత్రధర్మంకాదు. ఎవరో, ఏమో అనుకుంటారనికాదు. మన మనసుకు మనకే బాగుండదు: ఆపిల్లకూడా, నీచూపుల్లో చూపుకలిపి ఖుషామత్ చేస్తూందంటున్నావు గనుక, స్నేహితుల్లో ఎవరిభార్యా

కానిపక్షంలో చెల్లెలైనా, మరెవరైనాకానీ, ఫరవాలేదు. నీవు నిరాఘాటంగా ముందు అడుగువేయవచ్చును. నీ అదృష్టం పండించుకోవచ్చును. అదేదో తేలేదాకా నీవు కనురెప్పమెదపడం చేయివిసరడం, చిరునవ్వు నవ్వడం, ఇత్యాదులు...టాబూ... తెలిసిందా?"

వాదించి లాభంలేదు. సరేనని ఒప్పుకున్నాను. కాని, తెలుసుకోవడం ఎల్లా? వచ్చిన స్నేహితుణ్ని ప్రతివాడినీ "ఏరా అబ్బీ, నీవు సకుటుంబంగా వచ్చావా"అని లౌక్యం చేసి అడిగిచూశాననుకో. అవతలవాడు అవునన్నా, కాదన్నా ఆ అమ్మాయి ఫలానివాడి పెళ్ళాం అని తేలదు కదా ! అంతటితో పోనీ, ఇంకా కొంచెం చొరవచేసి, ఆ అమ్మాయి నీభార్యయేనా అని ఎవడినో ఉజ్జాయింపుగా అడిగితే, తీరా నిజమయేపక్షంలో మనవాడికి అనుమానం కలగకమానదు. అది మరీ అసలుకే మోసం. మాకోటరీ వాళ్ళని, ఎవరని అడుగుదామా? అందరూ కొంటెతనానికి పోయి మా ఆవిడంటే, మా ఆవిడనిఎగపడితే మనం అనుకున్నపని కాకపోగా నలుగురికీ ఆకతాయితనంచేయడానికి సందుచూపించినట్టవుతుంది. ఈ ముసుగులో గుద్దులాట యెందుకు? ఆ అమ్మాయినే ఆమాట అడుగుదామా అంటే కోమటిసరసంలోకి తేలదూ?

ఎటూ తోచక ఏమిటీ కర్తవ్యం అని మంత్రోపదేశంచేసినవాడిదగ్గరకే మళ్ళీ సలహాకు వెళ్ళాను. ఆ ధీరుడు సెలవిచ్చింది ఏమంటే – 'ఈ సందర్భంలో నీస్వయం కృషివల్లనే తెలుసుకోవలసిందేకాని, వేరే మార్గం లేదు.

జాగ్రత్తగా కనిపెడుతూఉండు. ఎప్పుడూ వెన్నంటి తిరుగుతూనే ఉన్నావుకాదూ? ఎవరు ఆ అమ్మాయివేపు సొంతసొమ్ములాగా పరిచయంగా చూస్తూంటారో నలుగురిలో ఉన్నప్పుడు, ఎవరికోసం ఆ అమ్మాయిచూపులు వెదుకుతుంటాయో—ఆట్టే గడిదేరినట్టు కనబడటంలేదు ఇంకా - కనక వాళ్ళిద్దరూ దంపతులని మనం నిశ్చయంచేసుకోవచ్చును. ఈ దోవతొక్కి చూడు. ఆపైన ఆపెచిత్తం దేవర భాగ్యం !

చూశాను. అటూ లాభించలేదు. మిసమిస లూరిపోతూన్న పిల్లగనుక ప్రతివాళ్ళచూపులకీ, ఆ అమ్మాయే గురి. మిడిసిపడుతూన్న బేడిసల్లాగా చెంపకు చారెడు కళ్ళు వేసుకుని సదస్యం సావడంతా చుట్టుతిప్పి నిమిషానికి మూడు సార్లు కలువల తోరణాలు కడుతూన్నది.

పునః గురుపాదుల దగ్గరకువెళ్ళి స్వస్తిచెప్పుకున్నాను. వాడంటాడుకదా - 'అవునురా - ఉత్సవాల్లో ఈలాటి శుభ కార్యాల్లో ఆడపిల్లలు వెనుకా ముందూ చూడకుండా, మాంచి ఉమ్మసుమీద ఉంటారు. వాళ్ళకు ఆటవిడుపు రోజులు ఇవే. వట్టిరోజుల్లో అయితే, కూచుంటే తప్పు, నిలుచుంటే తప్పు - ఇప్పుడేగా రికామీగా ఉండనిచ్చేది. అయినా పెళ్ళికి వెళుతూ పిల్లిని చంకనువేసుకువచ్చినట్లు వచ్చే వాళ్ళు ఒకళ్ళే రాక ద్వంద్వ సమాసాలు దిగుతాయేమిటోయ్—"

నాకు, చప్పున ఒక ఊహతట్టింది— ఒంటరిగానే వచ్చిందేమోరా? ఇంత చలాకీగా ఉన్న అమ్మాయి. గుది

బండను కోరి వెంట తెచ్చుకుంటుందా?—అలా కానిపక్షంలో ఇంతకాలం వృధాగా గడచిపోకుండా ఈపాటికి ఇంద్రభోగం అనుభవిస్తూండేవాడినే. పోనీ ఇప్పటికైనా నేను చొరవ చేయవచ్చునా?" అని వాడి అనుజ్ఞ అభ్యర్థించాను.

వాడా మన జోల్తాలోపడేది? నా ఆదుర్దా కనిపెడుతూన్నకొద్దీ మరీ నిదానంలోకి దిగిపోయాడు. వరదహస్తం నా ముఖానికిదగ్గరగా ఆడిస్తూ "అమ్మమ్మ! మనం ఏపని చేసినా అనుకున్నమాటప్రకారం పోవాలిసిందే - ఒంటరిగా వచ్చిందనుకోడానికి ఏం నిదర్శనాలున్నాయి? _ ఊహాగానం పనికిరాదోయ్ భయ్యాఁ! మనకు ప్రత్యక్షం - ప్రమాణం ముందు నికరంగా తేలవలసిందే" - అని ముద్రవేసేశాడు.

"అయితే ఏంచేయమంటావురా-ఈ తటపటాయింపులతో పుణ్యకాలంకాస్తా గడిచిపోతూంది -ఇవాళ సదస్యమా, అప్పుడే నాకబలి అయినతరువాత ఒక్కక్షణం ఉండము కదా? - పోనీ, ఏదో మస్కా వేసి ఏలాగో ఇంకోరోజుకూడా దేకినా, ఆ అమ్మాయి ఉంటుందో లేదో తెలియదుకదా ?- ఏదో అనిూంతుమిూ తేలకపోతే ప్రాణాలు నిలిచేటట్టులేదు— భరతవంశంపు బ్రతుకు..."

మాటకుమాట అడ్డంవేసి బ్రహ్మాండమైన ఎత్తు ఏదో తట్టినట్టు కళ్ళు జిలజిలలాడిస్తూ నా భుజం తట్టి "నీ రొట్టె నేతిలో అమాంతం విరుచుకుపడుతుందిలేరా! దీని కిక తిరుగులేదు. నీవుపడ్డ శ్రమంతా రెట్టికిరెట్టింపు ఫలిస్తుంది" అని అభయం ఇచ్చాడు. ఏమిటో చెప్పమని తహతహలాడి పోయినాను. వాడు, తాపీగా "కొంచెం ఓపికపట్టాలి.

కార్యార్థివి ఇంత తొందరపడితే ఏలా? దైవం అనుకూలిం చాలి. మనయత్నం కలిసిరావాలి మిథున విడియాలందు కునేందుకు జంటలు జంటలుగా దంపతులు తయారుకాక తప్పదుకదా - అప్పుడు ఈ తర్జనభర్జన లేమీ లేకుండా ఇద మిత్థమని నిర్ధారణఅయిపోక తప్పదు—"

"తేల్చుకుని, మూటాముల్లే సర్దుకుని బండి ఎక్కడ మేనా."—

"ఏం ఉన్న వ్యవధి చాలదేం? — వెన్నెలరోజల్లా ఉంటుందా? - 'దొరికిననిమిషం బీరుపోదు, మన దొర గారే మొనగాడు' వినలే ఈ పాట. మామజాగాఉంటుంది. ఇంకేం ఖుషీసే జావో - ఈలోపల మాత్రం ఏమన్నా పిచ్చి వేషాలు వేశావా 'నాకు నీయానగలదుసుమా...నాయనా.

వెక్కిరింపు ముదిరిపోనీయకుండా తప్పించుకుని బయటపడి నిమిషమొకయుగంలాగు యుగమొక నిమిషంగా గడచిపోయే ధన్య - తరుణావసరం ఎప్పుడెప్పుడా అనుకుంటూ గడిపాను. ఎన్నిసార్లు ఆ అమ్మాయి కనిపించినా తలఎత్తి చూడనన్నా చూడకుండా తప్పించుకుని మనసు సంబాళించు కుని ముహూర్తమాత్రం కురుకాంత ధైర్యం ఇలా, ఏలాగో, తేలిపోతూ నేలకు వాలిపోతూ ఎల్లాఉన్నానో సహించి, నాకే ఆశ్చర్యంగాఉంది.

మనకోసం ప్రొద్దునిలుస్తుందా పరుగెత్తుతుందా ?— దానివేళ దానిదికాని? - నేను, ఆ సాయంకాలమంతా తీర్చి దిద్దుకుని ఉబుసుపోక ఇష్టంవచ్చినట్టు షికారుకొట్టివచ్చి నిద్ర పోదామనుకుని, రాక, లేచి చెరిగినతల జాముసేపు మళ్ళా సరి

జేసుకుని మరోమారు లవెండర్ తుంపురులు ఒంటిమీద చిమ్ముకుని పాన్పు వేయగానే అక్కడ ప్రత్యక్షమైనాను. ఈ బ్రహ్మచారికి ఇక్కడేంపని, అని కొందరు వింతగా చూసి నవ్వుకున్నారు. మనం అవేవీ లక్ష్యంచేసేస్థితిలో లేము: చూపూ, మనసూ ఒకకొసాకు తెచ్చి మెలిజేసి పాన్పు చుట్టూ చక్రభ్రమణం చేయిస్తూన్నాను. ఒక్కొక్కళ్ళే వస్తూన్నారు. తలోవేపునుంచీ వచ్చి సరసను నిలుచుని తాంబూలాలు పుచ్చుకుని కలిపి మళ్ళా విడబడుతూన్నారు.

అందరూ వచ్చారు. ఆ అమ్మాయి కనబడదు. తాంబూలపుపళ్లెము ఖాళీ అయింది. ఆ అమ్మాయి జాడా యే లేదు.

పాతాళందాకా కుదించుకుపోతూన్న అడుగుల్ని బలవంతాన పెకల్చి వేసుకుంటూ ఊపిరన్నా సలుపు తుందని - పక్కవసారాలోకి వస్తూన్నాను: మబ్బుచాటున ఇరికిపోతూన్న చంద్రరేఖ తళుక్కుమని మాయమైపోయింది. ఆ అమ్మాయిమాట వినపడ్డది. ఇంకో అడుగు వేసేటప్పటికి ఆఅమ్మాయి కనపడ్డది. నన్నుచూసి నవ్వు మొగం దూరంగా చేసుకుని మాసినచెరగు పిరుదులమీదుగా తిప్పి అంచు రొండి నమర్చుకుంటూ తొలగిపోయింది!

ఏం చెయ్యను చెప్పు? దైవం వంచన తలపెట్టినప్పుడు. ప్రతీకారం మన చేతులోపనా ?

తిరిగి వచ్చేశాం. మనసు మనస్సులో లేదు. మరచి పోదామన్నా మరపుకురావడంలేదు.

స్కూలుకు వెళ్ళడంకూడా కట్టిపెట్టి వసారాలో

కుర్చీలో దిగాలుపడి కూర్చుని ఉండేవాణ్ణి. దేహం మన స్వాధీనంలోలేదు. సుబ్బులు, వాడిపనేదో వాడు చేసుకు పోతూ నన్ను పలకరించకుండా, నా చాయలకైనా రా కుండా తమాషాగా తప్పించుకు తిరుగుతూండేవాడు. మెద డంతా, భూకంపం తరువాత బీహారులాగా అయిపోయింది. ఎప్పటికి కోలుకుంటానో నాకే తెలియదు. చెప్పి మనసులో మంట చల్లార్చుకునేందుకు వెళ్ళినవాడవు నీవు యకాయకిని తిరిగిరాకూండా, అక్కడినుంచి మదరాసుకొట్టేసి నీ చిత్తం వచ్చిన యింటిమీద బుద్ధిమళ్ళినతరువాత కాని, దయచేయక పోతివి.

మాడు, వాల్కానో అయిపోయి సెగలుచిమ్ము తూంటే యథాశక్తి ఉపశమనంచేసుకుందామని చిమ్మచీక టిలోనే లేచి బాగా ఎండఎక్కి తెరలువిడిపోయేదాకా, మంచులో ఇంటిముందు తోటలో తిరగడం అలవాటుచేసు కున్నాను. కాని సాఫీగా నడకసాగేదనా? ఏమేమో జ్ఞాపకం వచ్చి అడుగు ముందుకు పడేదికాదు. మరిన్ని గులాబీబొగ డలు మంచులో చెమ్మలెత్తి తేనెలూరుతూన్నట్టుగా ఉం డేవి. అలాటప్పుడు ఆ అమ్మాయి పెదవులేమోనని భ్రమ పడటం నా అవస్థలో అబ్బురమా?

కోరకాలేనా...విచ్చిన గులాబీలు మాత్రం మోసం చేయలేవనుకున్నావా?—

అవాళ గులాబీచెట్టుదగ్గిరే నిలుచుని ఉన్నాను. ఎండతెరవిచ్చింది కాని, నేను తడిసిన తలను, చేతులతో అద్దుకుంటూ పరధ్యానంలో ఏమో, అలాగే ఉండిపోయాను.

గేటు తలుపు కొంచెం చప్పుడైంది. ఏడెనిమిదిఏళ్ళ అమ్మాయి ఓరెక్క కొంచెం నెట్టి ఆసందులోనుంచి తల ముందుకు రానిచ్చి బెదురుకుంటూ ముగ్ధంగా మహా మధురంగా నా చూపు తనవేపులాక్కుంటూ "గులాబీపూలియ్యరూ" అని కూసింది. నేను, ఏమీ చెప్పకముందే, ఆ అమ్మాయి వెనకాతలనుంచి "రావే పోదాం" అనే పిలుపు —కొంచెం ఉండి, "నీవు రాకపోతే నేను వెళ్ళిపోతున్నాను." అనే బెదరింపూ, అంతకన్నా మరీ అందమైన గొంతులో వినిపించినవి. వినీ వినడంతోనే మనసు స్టీరింగు తప్పిపోయినకారులాగా తూలుకుంటూ పొగరుబోతు పరవళ్ళలో గేటు కమ్ములు దూసుకునిపోయి బయట వాలింది.

ఈ భాగ్యవశంచేత గాలికి నెట్టుకొని కటకటాలకు అడ్డంగాఉన్న రెక్క ఈవలికి నెట్టుకువచ్చి ఆంధ్రవధూటీ సౌభాగ్యం అరచాటుగాఉన్నప్పు డెంతగా ఉవ్విళ్ళూరిస్తుందో నాకు అనుభవించే యోగ్యతను ప్రసాదించింది.

నన్ను పూలడిగిన చిన్నపిల్లమాటకు జవాబులేక, నా ధోరణి అర్థంకాక మళ్ళా అడగడానికి బింకంలేక పూల ఆశ వదలలేక నన్ను ముందరికి పోనీయకుండా అడ్డంగా అక్కడే నిలుచుని ఉన్నది. రెపరెపలాడిన వల్లెవాటు /చెరగు నన్ను కూడా ఆస్థితిలోకే తీసుకువచ్చి మాయమైంది: ఆశలు వెనుకకు మళ్ళించుకుని ఆ పిల్లకు...పసరు పూపలైనా మిగల్చకుండా గులాబీ గుబురంతా దూసి లంగా ఒడి నింపేశాను. పాపం మాటసందెడై కాళ్ళ బందాలుపడుతూం

డగా వాళ్ళ అక్కతో కలుసుకోవాలని పరుగెత్తింది: గేటు దాటివచ్చి మెట్లమీద నిలుచుని కనుచూపు మేరదాకా మలుపుతిరిగి వాళ్ళు కనపడకుండా పోయేదాకా ప్రతిమావస్థకు వచ్చింది మన మూర్తి!

లోపలికి వెళ్ళా నన్నమాటేకాని చేజిక్కిన నవనిధులూ పొరబాటున జారవిడుచుకున్న కృపణావతారం మెరుగు నాకన్న. ఇంకొకళ్ళకయితే ఈ స్వల్పవిషయం ఇంతగా మనసుకు పట్టిచ్చేదికాదు. నేను మొదటనే మనవిచేసుకున్నానుకాదూ? ఏ నీవో ఇంక మరొకరో అయితే అడిగి పిల్లకు ఒకటో అరో పూలిచ్చి వెనుకనుంచి పిలిచినపిల్ల బహునాజూకుగా కులికిందని, ఒకమారు దమ్మగా అనుకుని మళ్ళా మర్నాడు, ఆపిల్లే వచ్చి పూలడిగితే ఆనవాలుపట్టలేక కొత్తగా చూసేవాళ్ళు - నేనా మీకూ, నాకూ అక్కడే ఉంది తేడా.

అప్పటినుంచీ ఇంకో ఆలోచనపోలేదు: వేరేపని తోచలేదు. రాత్రి ఆ పవలూ ఎలాగో గడిపాను. తెల్లవారగానే తోటంతాతిరిగి గులాబీలన్నీ కోసి పూలబుట్టలో అందంగా అమర్చి ఎప్పుడు వాళ్ళువస్తారా అని ఎదురుచూస్తూ నిలుచున్నాను. ఎలా అనుకున్నాననుకుంటావా? అది నా మనసుకు తెలియాలి.

ఇద్దరూ కలిసే వస్తూన్నారు, ఒకరితో ఒకరు ఏవో కబుర్లుచెప్పుకుంటూ, నవ్వుకుంటూ. నన్ను చూడగానే, చిన్నపిల్లముఖం కలకలలాడి అడుగు ముందుకు

వేసింది. ఆ వయ్యారి అనుమానించినట్టు గమనం మందగిం
చింది అన్నమాటేకాని, ఇద్దరికీ అట్టే ఎడంలేదు.

దగ్గరకురాగానే నేను చేతులుజాచి పూలు అందీయ
బోయినాను : చిన్నపిల్ల అమితఉత్సాహంతో దగ్గరకు రాబో
తూండగా మా భామ చేయిపట్టుకుని ఆపి కోపంగా "వద్దు"
అన్నది నావంకచూడకుండా చెల్లెలినే గదమాయించుతూ.
ఆ అమ్మాయిమాత్రం తక్కువతిన్నదా ఏం? విదిలించుకుని,
రెండోచేత్తో సజ్జ అందుకుని, "నాకక్కవాలి, నిన్న అన్నీ
నువ్వే తీసుకున్నావుగా అమ్మ! చిన్నదాన్ని నన్ను అన్యా
యంచేసి! ఒక్కపిసరన్నా యిస్తానేమో చూసుకో?" అని
చాడీలుగా చెప్పడంతో నాకు వేయిదేవతలు వరాలు కురి
పించినట్లైంది. పూలన్నీ ఆ అమ్మాయి తీసుకుందా నిన్న ?

మళ్ళా మర్నాడు—

"నాకు మల్లెలు - అక్కయ్యకు గులాబీలూ" అని
నన్ను చూడగానే నవ్వుకుంటూ దగ్గరకువచ్చింది మరదలు:
నాకూ, ధైర్యంవచ్చిచేయికొంచెంపైకిఎత్తి "ఎవరికోచ్, ఎవరి
క్కావాలోచ్" అని ఆ అమ్మాయివంకేచూసి చేరరమ్మని
చూశాను. ఫలించింది - మరిదరిదాపుకు రాలేదు చేతికి
చేయైనా తగులనీయలేదు: కాని అందుకుని తలవంచుకుని,
నిలుచున్నది పూలమీాదనే చూపు నిలిపి: నేను ఆపైమాట
తోచక పలుకరించలేదు. వాళ్లూపలుకలేదు. "వెళుతున్నాం"
అన్నది చిన్నమ్మాయి. మౌనం ఉభయపార్శ్వాలా కంట
కమైపోయినతరువాత, "మళ్ళా రేపు" అన్నాను. అప్పటికి

జవవచ్చి: నిశ్చయంగా చెప్పలేను కాని తల రవంత ఊగించిందని తోచిందోయ్ నాకు.

మూడోనాడు మామూలుకన్న కొంచెం ఆలస్యంగా అయితే ఒంటరిగా వచ్చింది. మనకు అంతకన్న కావాలిసిందేముంది?–వసంతలక్ష్మిని ఆహ్వానించే మాధవుడి మమతతో లోపలికి తీసుకువెళ్ళాను. చెట్టుచెట్టుదగ్గిరా నిలిచి పూలు ఏరి కోసుకుంటూ కోసినపూలన్నీ వెనువెంటనే దండగా అల్లుతూ జాజిపొదలచాయకు జేరుకునేటప్పటికి వంకీగా తయారుచేసి నాచేత బ్రతిమాలించుకుని తురుమనిచ్చింది: నవ్వుకు నవ్వుతోనే బదులుతీర్చింది: అందుకున్న చేతిని అంతలో లాక్కోకుండా నాకై వసాన మనసారమసలనిచ్చింది. ఎంతకు నోచుకున్నానో ఎన్ని కలలుకన్నానో? ఒకళ్ళకి ఒకరు ఎంత కావలసినవాళ్ళమైపోతా మనుకున్నానో ఇప్పటికీ మరచిపోలేకుండాఉన్నానోయ్. ఆవాళ అందం, అలంకరించుకున్న సోయగం, గోధురంగుచీరె, నొక్కు నొక్కులపైట అమరిక, జుబ్బా జరీగేరలకు రాచుకుంటూ తళుకుమనే లోలాకులు కులికినప్పుడల్లా, వెన్నెలలు చిలుకుతూ, ఎందుకులే బాబా! పలికినందుకు తలచుకున్నందుకు ఫలమేమి ?

ఈ మూన్నాళ్ళ సహవాసంతోనే, ఆ అమ్మాయి మీద నాకు మక్కువ అనూపంగా పెరిగిపోయింది. కనబడేదాకా నిలువలేకపోయేవాడిని. కలుసుకున్న తరువాత ఓ పట్టున విడువలేకపోయేవాడిని. నవమల్లిక చూశావ్. ఇంత కథా చెపుతూ ఇందాకటినుంచి పేరుఏమిటో చెప్పడమే

మరచిపోయినాను. నీవన్నా అడిగావు కాదేం? - మరొచ్చి వినడం విసుగుగాఉంటే చెప్పు, మొగమాటానికి పోక, ఆం లేదురదా సరే.

నవమల్లిక కాలేజీలో పెయింటింగ్ నేర్చుకుంటూంది. చుట్టయినా, మాయింటిమీదుగా వచ్చేది. వచ్చేవేళకు, నేను సిద్ధంగా కాచుకుని ఉండేవాణ్ని. ఇద్దరంకలిసి బహు కులాసాగా ఏవేవో అర్థంలేనికబుర్లు చెప్పుకుంటూ దోవలో ఎవరూ చూడనప్పుడు చేతులు కలుపుకుంటూ నడచిపోయే వాళ్ళం నిదానంగా. ఎంత ఆలస్యంచేసినా కాలేజీగేటు కనబడగానే అప్పుడే వచ్చామే, ఇక విడిపోవాలికదా అని అడుగు ముందుకు వేయడానికి మనసొప్పేదికాదు: టైమై పోయిందని పారిపోయేదాకా అక్కడే నిలుచుని మాటల లోకిదించి కదలనిచ్చేవాడిని కాను.

సాయంకాలం చివరి పీరియడ్ ఎగగొట్టి నేను కాలేజీ నుంచి, ముందుగా బయలుదేరి వాళ్ళ స్కూల్ దగ్గరకు వచ్చి తారట్లాడుతూ తొందరగా నడవదని స్కూల్ గడియారాన్నీ వేళకుగంటకొట్టడని ముసలిబంట్రోతునూ, మనసులో లక్షలు తిట్టుకుంటూ కాలు నిలువకుండా ఉండేవాడిని. టైమై పోయి మల్లిక గేటుదాటి బయటపడగానే ఇంకోదోవను, అది మరీచుట్టు, వాళ్ళయింటిదాకా కలిసి వెళ్ళేవాళ్ళం. వాళ్ళమేడ సందులో లోపలగా ఉంటుందిలే. నేను మొగ దలనే ఆగిపోయేవాడిని, మల్లిక గడపలన్నీ ఎక్కి వెనుదిరిగి నావంక చూసి మాయమయేదాకా!- "లోపలికిరావచ్చును

మావాళ్ళు ఎవరూ ఏమీ అనరు..." అని అనేకసార్లు రమ్మని బలవంతంచేసింది. నాకే ఎందుచేతనో దమ్ములుం డేవికావు.

—సుబ్బులు వాళ్ళ ఊరువెళ్ళాడు: నేను ఒంటరిగానే ఉన్నాను: ఆ సంగతి మల్లికకు తెలుసు.

శనివారం—సెలవురోజు కనక ఆనాడు ఉదయం మేమిద్దరమూ కలుసుకోలేదు. సాయంకాలం టోర్నమెంటు చూడటానికివెళ్ళి పొద్దుగుంకిన తరువాత ఇంటికిచేరుకున్నాను. స్నానం, భోజనం అవీచేసి నాయరుహోటలుకు వెళ్ళి టీ త్రాగివచ్చి ఫ్రాన్సిస్‌కోనిట్టేపుస్తకం పూర్తిచేయాలని రాత్రి ఎంతైనాసరే సిగరెట్ ముట్టించి కుర్చీలో ఒరిగాను.

పేజీ తిరగకముందే తలుపు చప్పుడుకాకుండా తోసుకుని, మల్లిక లోపలికి వచ్చింది:—మరీ దగ్గిరికి వచ్చింది:

ఆవేళప్పుడు అసలు ఎన్నడూ లోపలికి రావడం ఆమెకు మామూలులేదు: చూడగానే మొదట ఆశ్చర్యం వేసింది. నాకోసమే వచ్చిందికదా అనుకునేటప్పటికల్లా మనసు పొంగిపోయింది. వెంటనే కౌగిలిలోకి లాక్కుంటే అభ్యంతరంపెట్టదు. నాకు తెలుసును కాని నామతం అది కాదు.

కూర్చోమన్నాను. దూరంగావున్న కుర్చీలో పోయి కూర్చుంది. అక్కడనుంచి ప్రేమఅంటే ఏమిటో ప్రణయ జీవనం అంటే ఏమిటో సామాన్య ప్రాపంచిక సుఖాలకు మించిన మానసికానురాగం ఎంత ఉత్తమమైనదో ఎంత గొప్పగా చెప్పాననుకున్నావు?—

నా తెలివితేటలకు అభినందించాలనీ ఇంతచదువు ఉన్నవాణ్ణని నన్ను మల్లిక మెచ్చుకోవాలనీ కాదు. నా మనసువిప్పిచెప్పుదామని, ఆమెచేత 'నేను నిన్ను మనసార ప్రేమిస్తూన్నాను' అని, అనిపించుకుందామని...

విన్నది. విని, ఊరుకున్నది.

కూర్చున్నదల్లా లేచి నావంక చూడకుండా 'వెళ్ళి వస్తాను' అంటూ అడుగు సాగించింది.

నేను, ఆదుర్దాగా ముందుకుఉరికి చేయిపట్టుకొని 'అప్పుడేనా' అన్నాను. ఆమె పెడమొగంగానే, 'అవును' అని చెయ్యి కొంచెం మోటగా విదిలించుకుంది.

"నీవు ఉంటావనుకున్నాను" నాకు మాటలు తడబడినవి. బ్రతిమాలుతూ అడగటంలో మల్లిక కొరడాఛళుకులాగా నావంక మళ్ళి కళలేని చూపుతో తీయదనం లేని నవ్వుతో "ఆలాగా" అని మిగిలినమాటలు మింగేసి వెళ్ళిపోయింది.

అంతే. ఆనాటినుంచీ నేనూ, మల్లికా పరాయివాళ్లం. చాలా రోజులదాకా కనిపించనేలేదు. ఇప్పుడు ఎన్నడన్నా ఒకవేళ కనిపించినా నావంక చూడనైనా చూడదు.

ఏమిటికారణం భాయీ, నాలో లోపమా? లేకపోతే జాతకఫలం ఆలాటిదా?

చెప్పనా – ఏమిటో.

మొదటిది – నీకు ఎవరిని ప్రేమించాలో తెలియదు..

రెండు - ఎలా ప్రేమించాలో అంతకన్నా తెలియదు. ఏం, శంకరాచార్యుణ్ణి అనుకుంటున్నావా ఏం. శృంగారం, వేదాంతం కలగలపి చలాయించుకు వచ్చేందుకు? ఆ అమ్మాయి నీమీద ఆపేక్షతో వచ్చింది: లెక్చరువినడానికా. ఉక్కిరి బిక్కిరి చేసేస్తివి. ఇంకానయం - కెవ్వున కేకవేసి నీకు పిచ్చి ఎత్తిందనుకుంటూ వీధినిపడ్డది కాదు - నీకు ఆలాటి సత్కారము కావాలిసింది. లేకపోతే కొంచెం గడుసరి అయితే "చుప్ రహో అని చెవిమెలివేసి అరచేతులలో ఎత్తుకుని......

చేతగానితనం కాకపోతే ఎందుకువచ్చిన వేషాలురా ఇవి - భాయీ!

—:—